నిబంధనలకు 'నీళ్లు'

- దందాగా సాగుతున్న 'మినరల్' వ్యాపారం
- ప్రమాణాలు పాటించని వ్యాపారులు
- జనం గొంతులో పోస్తున్న గరళం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

రాయదుర్గం: పెళ్లి అయినా, ఫంక్షన్ అయినా.. కార్యం ఏదయినా.. శుభకార్యం ఉందంటే చాలు ..మినరల్ వాటర్ ఉండాల్సిందే.. సామాన్యుడి నుంచి సంపన్నుడి వరకు తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలనే ఉద్దేశంతో శుద్ధజలాన్నే వినియోగిస్తున్నారు. బోర్లు, బోరుబావుల నీరు అధిక శాతం మంది ఇంటి అవసరాలకు మాత్రమే వాడుకుంటున్నారు. దీంతో ప్యూరిఫైడ్ నీటికి మార్కెట్లో డిమాండ్ ఏర్పడింది. ప్రజావసరాలను ఆసరాగా చేసుకున్న నిర్వాహకులు పుట్టగొడుల్లా ఆర్‌ఓ ప్లాంట్లు నెలకొల్పి, 'మినరల్' పేరుతో వ్యాపారం చేస్తున్నారు. వీధి వీధిలో తిరుగుతూ ప్రతి ఇంటికీ నీళ్లు అమ్ముతున్నారు. ఏమాత్రం నాణ్యత ప్రామాణాలు పాటించకుండా ప్రజల గొంతులో విషం పోస్తున్నారు. ఐఎస్ఐ నిబంధనలను తుంగలో తొక్కి రూ.కోట్లకు పడగలెత్తుతున్నారు. ఫలితంగా అమాయక ప్రజలు అనారోగ్యంపాలవుతున్నారు.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో అధికారుల లెక్కల ప్రకారం ఆర్‌ఓ ప్లాంట్లు, ప్యాకింగ్ ప్లాంట్లు, నీటి బాటిల్ ప్లాంట్లు సుమారు 200 దాకా చిన్న, పెద్దవి ఏర్పాటయ్యాయి. వీటిలో 10–20 ప్లాంట్లకు మాత్రమే అన్నీ అనుమతులు ఉండగా, మిగిలిన వాటికి అరకొర అనుమతులతోనే నెట్టుకొస్తున్నారు. 2006 చట్టం సెక్షన్ 79, 80 ప్రకారం వాటర్ ప్లాంట్స్ కచ్చితంగా బీఎస్ఐ ద్వారా లైసెన్స్ తీసుకొని గుర్తింపు పొందాల్సి ఉంటుంది. అయితే ఇలాంటి వేవీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.



ఆటోలో పాత క్యాన్లలో తీసుకెళ్తున్న నీరు



ఓ మిద్దెపై నాణ్యతలేని ప్లాస్టిక్ ట్యాంకులో నిల్వ చేసిన నీరు

ప్రజారోగ్యానికి ముప్పు తప్పదు..

నీటిలో సాయిల్, ఐరన్, యాసిడ్, కోర్లిన్, క్లోరైడ్ వంటి ఆమ్లాలు ఉంటాయి. ఇవి అవసరమైన దానికంటే ఎక్కువ మోతాదులో ఉంటే ప్రజారోగ్యానికి ముప్పు తప్పదని వైద్యులు చెపుతున్నారు. అందుకే ప్లాంటులో కెమికల్ అనాలసిస్ ల్యాబ్ ఏర్పాటు చేసి కెమిస్టు, మైక్రో బయోలజిస్టులను నియమించుకోవాలి. ఫిల్టర్ చేసే ముందు నీటిని పరీక్షించాలి. ఫిల్టర్ అయ్యాక నీటిలోని కాఠిన్యత, లవణాలు, రంగు, రుచి పరీక్షించాకే విక్రయించాలి. కానీ ఇవేవీ జరగడం లేదు. బోరు నీటిని ఫిల్టర్ చేశాక వాసన లేకుండా, రుచి ఉండేలా రసాయనాలు కలుపుతున్నారు. ఫలితంగా మినరల్స్ పూర్తిగా పోతున్నాయి. ఈ నీటిని తాగే జనం రోగ నిరోధక శక్తి తగ్గిపోతుందని, కాల్షియం కోల్పోయి మోకాళ్ల నొప్పులతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

నిర్వహణకు కావాల్సినవి..

- ఐఎస్ఐ, బీఐఎస్ సర్టిఫికెట్లు, చిన్న తరహా పరిశ్రమల ద్వారా రిజిస్ట్రేషన్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సర్టిఫికేషన్, నీటి నాణ్యత ధ్రువీకరణ పత్రాలు, కెమిస్ట్ మైక్రోబయోలాజి ల్యాబ్ ధ్రువీకరణ పత్రం, పెస్ట్ కంట్రోల్ సర్టిఫికెట్.
- తాగునీటి నాణ్యత పీహెచ్ 6.5 నుంచి 8.5 ఉండాలి. టీడీఎస్ 100 లోపు ఉండేలా చూసుకోవాలి.

బోరు, కుళాయి నీరే మేలు:

బోర్లు, కుళాయిల్లో వచ్చే నీరే సురక్షితమని వైద్యులు చెపుతున్నారు. జిల్లాలో శ్రీరామరెడ్డి తాగునీటి పథకంతో పాటు రాయదుర్గంలో వైఎస్సార్ నీటి పథకాలు వినియోగంలో ఉన్నాయి. ప్రజలకు స్వచ్ఛమైన సురక్షిత తాగునీరు అందించేలా ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ నీటికే వాటర్ ఫిల్టర్లు ఏర్పాటు చేసుకోవడం లేదా కాచి చల్లార్చి తాగడం లాంటివి చేస్తే మంచిదని వైద్యులు చెపుతున్నారు.

ప్లాస్టిక్ క్యాన్లలో స్టోరేజీ ఉంచకూడదు..

శుద్ధి జలాన్ని స్టోరేజీ చేసే సిస్టన్లు ప్యూర్లి స్టీలువై ఉండాలనే నిబంధనలు స్పష్టం ఉన్నా, చాలా చోట్ల ప్లాస్టిక్‌వే సిస్టన్లు వినియోగిస్తున్నారు. నీటిలో క్రిములు ఉత్పత్తి అయ్యి అనారోగ్య సమస్యలకు దారి తీస్తుంది. శుభ్రత చేపట్టేందుకు సైతం ప్లాస్టిక్ సిస్టన్‌లతో ఇబ్బందులు తప్పవు. చాలా చోట్ల ఈ తరహా క్యాన్లే అధికంగా కనిపిస్తున్నాయి. శుద్ధజల కేంద్రం నుంచి ఆటోల ద్వారా ఇళ్లకు సరఫరా చేసే క్యాన్లను నెలకు ఓసారి కూడా శుభ్రం చేయకపోవడంతో వ్యాధుల ముప్పు తప్పలేదు. సంబంధిత అధికారులు పరిశీలించి, నాణ్యత ప్రమాణాలకే పెద్దపీట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

తనిఖీలు నిర్వహిస్తాం



ఆర్‌ఓ ప్లాంట్ల నిర్వాహకులు బీవోఐఎస్ నిబంధనలు తప్పని సరిగా పాటించాలి. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్లాంట్లు నిర్వహించాలి. నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ప్లాంట్లపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ఈ విషయంలో వినియోగదారులు కూడా అప్రమత్తంగా ఉండాలి. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వారితోనూ ఆకస్మిక తనిఖీలు నిర్వహించేలా చర్యలు చేపడతాం. పట్టణాల్లో ఎక్కడెక్కడ ఆర్వో ప్లాంట్లు ఉన్నాయి? వాటికి ఉన్న నిబంధనలు..? అనుమతులపై ప్రత్యేక టీం ఏర్పాటు చేసి విచారణ చేయిస్తాం.

– కిశోర్, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం

క్లుప్తంగా

ప్రత్యేక పూజలందుకున్న జోడు లింగాలు



కూడేరు: జోడు లింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

కూడేరు: మండల కేంద్రంలోని శివపార్వతుల స్వయంభు జోడు లింగాల సంగమేశ్వరస్వామి పుణ్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు. శంభో శంకర హర హర మహదేవ అంటూ ఆలయంలో శివనామ స్మరణ మార్మోగింది. ఆలయ అర్చకులు శివపార్వతులకు క్షీరాభిషేకం, రుద్రాభిషేకం నిర్వహించారు. తర్వాత వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలకంరణ చేసి, భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. భక్తులు జోడు లింగాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

స్పెషల్ డ్రైవ్ గడువులోపు పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారులు

వజ్రకరూరు: మాతాశిశు సంరక్షణ సేవలపై ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసే స్పెషల్ డ్రైవ్‌ను గడువులోపు పూర్తి చేయాలని వైద్యాధికారులు తేజస్వి, సర్దార్‌వలి తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో స్పెషల్ డ్రైవ్‌పై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ గురుప్రసాద్, హెచ్ఈ సత్యనా రాయణ, సూపర్‌వైజర్లు నాగ శంకర్, సుశీలమ్మ, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు తది తరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



పెన్నహోబిలంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం

ఉరవకొండ: పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని కొకుంట్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి అనికేత్ చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ, ఎంపీహెచ్ఓ గోవిందు, ఆరోగ్య సహాయకులు నాగరాజు, ఏఎన్ఎం వరలక్ష్మి, చంద్రకళ, ఎంఎల్‌పీ ప్రియాంకలు పాల్గొన్నారు.

ఉంతకల్లు కొండపై ఎలుగుబంటి సంచారం



ఉంతకల్లు కొండలో సంచరిస్తున్న ఎలుగుబంటి

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లు సమీపంలో ఉన్న కొండలో ఎలుగుబంటి సంచరిస్తోందని గ్రామస్తులు తెలిపారు. కొండలో గొర్రెల కాపరులకు ఇటీవల తరచూ ఎలుగుబంటి కనిపిస్తోందని చెప్తున్నారు. ఎలుగుబంటి సంచారంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. కొండకు ఆనుకొని గ్రామం ఉండటంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

సజావుగా పాలిసెట్ కౌన్సెలింగ్

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. పాలిసెట్‌లో 1వ ర్యాంక్ నుంచి 12,000 ర్యాంక్ వరకు కౌన్సెలింగ్ జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌కుమార్ తెలిపారు.

బాలికల రక్షణ చట్టాలపై అవగాహన ఉండాలి



శెట్టూరులో ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్, ఆర్డీటీ సిబ్బంది



కిశోర బాలికలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

- మాసిక దినోత్సవంలో సీడీపీఓ ప్రభావతి

రాయదుర్గం రూరల్: కిశోర బాలికలు రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సీడీపీఓ ప్రభావతి తెలిపారు.సోమవారం మండలంలోని 74 ఉడేగోళంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో మాసిక దినోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం సీడీపీఓ మాట్లాడుతూ అమ్మాయిలు బాగా చదువుకొని, ఉన్నత పదవులు పొంది ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. బాల్య వివాహాలు చేసే వారి గురించి చైల్డ్ లైన్ 1098, 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్ వాడీ హెల్పర్లు నాగేంద్రమ్మ, మద్దానక్క, లతమ్మ, కిశోర బాలికలు, వారి తల్లులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ బాలికా దినోత్సవం

శెట్టూరు: మండల కేంద్రంలోని ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం సోమవారం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ వనజాఅక్కమ్మ పాల్గొని మాట్లాడారు. భ్రూణహత్యలు అరికట్టి, బాలికలను రక్షించుకుందామన్నారు. స్త్రీ పురుష భేదం వీడాలని, మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ సంస్థ సిబ్బంది, సీఐడీఎస్ సూపర్‌వైజర్ రాధమ్మ, మహిళ పోలీసులు, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రాయితీ విత్తన వేరుశనగ పంపిణీ



వజ్రకరూరులో విత్తన వేరుశనగ పంపిణీ చేస్తున్న అధికారులు

వజ్రకరూరు: మండలంలోని అన్ని గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో రాయితీ వేరుశనగ పంపిణీ కార్యక్రమం జరుగుతోంది. మండలానికి 3,800 క్వింటాళ్ల వేరుశనగ ప్రతిపాదనలు పంపారు. మండలంలో ఎర్రనేలల్లో వేరుశనగతో పాటు కంది,ఆముదం తదితర పంటల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. వేరుశనగ పంట సాగు చేసే రైతులు రాయితీ వేరుశనగ విత్తనాలకోసం రైతు భరోసా కేంద్రాల వద్ద క్యూ కడుతున్నారు. అధికారుల లెక్కల ప్రకారం ఇప్పటికే 1000 మంది రైతులకుపైగా రాయితీ వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఏఓ మధుకర్, వీఏఏ సురేష్ నాయక్, ఎంపీఈఓ ప్రమీలా, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వగురు బసవేశ్వర జయంతి



బసవేశ్వర చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం: మండలంలోని పొబ్బర్లపల్లిలో సంఘ సంస్కర్త, పరమాత్మ బసవేశ్వర స్వామి జయంతి వేడుకలను వీరశైవ లింగాయత్ సేవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. బసవేశ్వర చిత్ర పటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అ కార్యక్రమంలో సర్పంచ్ మమత గంగాధర ,వీరశైవ లింగాయత్ కుల బాంధవులు పాల్గొన్నారు.

రాయదుర్గం(డి హీరేహాళ్): డీ హీరేహాళ్ మండలంలోని తిమ్మాలాపురంలో సోమవారం ఘనంగా బసవ జయంతి వేడుకలు నిర్వహించారు. బసవేశ్వరుడి చిత్ర పటానికి పూలమాలలు వేసి ట్రాక్టర్‌లో ఊరంతా చుట్టేశారు. యువకులు నదికోలు నాట్యం చేపట్టారు. వీరశైవ లింగాయత్‌లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామస్తులతో కలిసి బసవేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వీరశైవులతో కలిసి ఊరేగింపులో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాళ్ల తిమ్మారెడ్డి, తిమ్మాలాపురం వీరశైవ లింగాయత్, నాయకులు పాల్గొన్నారు.

చెట్లు నరికితే క్రిమినల్ చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

రాయదుర్గం: ఎవరైనా పచ్చని చెట్లు నరికితే చర్యలు తప్పవని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అటవీశాఖ రేంజర్ మధుబాబు హెచ్చరించారు.సోమవారం 'పచ్చదనం పై గొడ్డలి వేటు' శీర్షికన 'సాక్షి' లో కథనం ప్రచురితమైంది. జిల్లా అటవీశాఖ అధికారి స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు కళ్యాణదుర్గం రేంజర్ రాయదుర్గం బైలాంజనేయస్వామి ఆలయం ఎదుట నరికేసిన చింతవనంపై ఆరాతీశారు. పరిశీలించి, నివేదిక ఇవ్వాలని స్థానిక బీట్ ఆఫీసర్‌ను ఆదేశించారు. ఒకటి రెండు రోజుల్లో క్షేత్రస్థాయి పరిశీలనకు అధికారుల బృందం పంపుతామన్నారు. సొంత పొలంలో పెంచుతున్న చెట్లు అయినా సరై అటవీశాఖ అనుమతులకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

సంక్షిప్త సమాచారం

జిల్లా హెల్త్ మెడికల్ అడ్మినిస్ట్రేషన్ సర్వీసెస్ కన్వీనర్‌గా షఫీ

ఉరవకొండ: ఉమ్మడి అనంతపురం జిల్లా హెల్త్ మెడికల్ అడ్మినిస్ట్రేషన్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్‌గా ఎస్‌ఎండీ షఫీ నియమితులయ్యారు. రాకెట్ల పీహెచ్‌సీలో సీనియర్ హెల్త్ ఎడ్యుకేటర్‌గా పనిచేస్తున్న ఎస్‌ఎండీ షఫీకి ఉమ్మడి జిల్లా బాధ్యతలు అప్పగించారు. సోమవారం అనంతపురంలోని ఆదిమూర్తి నగర్‌లోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీ హెచ్ఏఎంఎస్ఏ) జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్ ఉమ్మడి జిల్లా కన్వీనర్‌గా ఎస్‌ఎండీ షఫీతో పాటు మరికొందరిని సభ్యులుగా నియమించారు.

శ్రీరామరెడ్డి తాగునీటి పైపులైన్ లీకేజీ

కళ్యాణదుర్గం రూరల్: పట్టణం సమీపంలోని కురాకులతోట జగనన్న కాలనీలో శ్రీరామరెడ్డి తాగునీటి పైపులైన్ లీకేజీ అయ్యింది. దీంతో నీరు వృథాగా పోతోంది.

90 శాతం సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు ఇవ్వాలి

కూడేరు: ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో అన్ని రకాల విత్తనాలు,ఎరువులను అందించి రైతులను ఆదుకోవాలని సీపీఐ, రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ రత్నరాధికను కలిసి సోమవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి మల్లికార్జున , రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్, నియోజక వర్గ కార్యదర్శి మనోహర్, మండల నేతలు పాల్గొన్నారు.

ప్రశాంతతకు భంగం కలిగిస్తే చర్యలు

కూడేరు: గ్రామాల్లో ప్రశాంతతకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని సీఐ శివరాముడు హెచ్చరించారు. సోమవారం రాత్రి ఆయన సిబ్బందితో కలిసి జల్లిపల్లిలో పర్యటించారు. గ్రామస్తులతో సమావేశమై మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల కౌటింగ్ సమయం దగ్గర పడుతోందని, ఎవరైనా బెట్టింగులు చేసుకోవడం, ఉద్దేశ పూర్వకంగా దూషణలు, ఘర్షణలు చేసుకోవడం, అల్లర్లు సృష్టించడం చేస్తే ఎవరినీ ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

బొమ్మనహాళ్: మండలంలోని దేవగిరి క్రాస్ వద్ద సోమవారం సాయంత్రం కాలువలోకి ట్రాక్టర్ బోల్తా పడింది. మండలంలోని ఉంతకల్లుకు చెందిన సురేష్ ట్రాక్టర్‌ను మారుతి అనే వ్యక్తి పొలం పనులకు తీసుకెళ్తుండగా, అదుపుతప్పి కాలువలోకి బోల్తా పడింది. అయితే ట్రాక్టర్‌లో వెళ్తున్న ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

30 నుంచి ఉరుసు మహోత్సవాలు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణం సమీపంలోని రోషన్‌వలి కొండపై ఈనెల 30 నుంచి మూడు రోజుల పాటు ఉరుసు మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు హజరత్ రోషన్ వలి దర్గా కమిటీ సోమవారం తెలిపారు. ఏటా రోషన్ వలి కొండపై ఉరుసు మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. 1న కొండపై ఉరుసు కార్యక్రమం ఉంటుంది.

గుండెపోటుతో వివాహిత మృతి

శెట్టూరు: ఐదుకల్లులో గొల్ల చంద్రకళ (36) గుండెపోటుతో మృతిచెందింది. చంద్రకళకు ఆదివారం అర్ధరాత్రి చాతీలో నొప్పి రావడంతో కళ్యాణదుర్గం ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలిస్తుండగా, మార్గంమధ్యలో మృతిచెందింది. తల్లి మృతితో ముగ్గురు పిల్లలు ప్రభాని (11), అనుశ్రీ (6), ఆరు నెలల బాబు అనాథలుగా మిగిలారు. తండ్రి గొల్ల తిమ్మరాజు ఆరు నెలల క్రితం బెంగళూరు అని వెళ్లి తిరిగి రాలేదు. పిల్లలను ఆదుకోవాలని గ్రామస్తులు, బంధువులు కోరుతున్నారు.

ముత్యాల పూసలతో జంబుకేశ్వరుడికి అలంకరణ



జంబుకేశ్వరస్వామి

రాయదుర్గం టౌన్: పట్టణంలోని కోటలో వెలసిన స్వయంభూ జంబుకేశ్వర స్వామిని అర్చకులు రామకృష్ణ ఆధ్వర్యంలో ముత్యాల పూసలతో సోమవారం అలంకరించారు. స్వామికి పంచామృతాభిషేకం, రుద్రకవాభిషేకం, మంగళ నైవేద్యం చేశారు.

భ్రమరాంబ మల్లికార్జునుడికి విశేష పూజలు



అలంకరణలో మల్లికార్జునస్వామి

ఉరవకొండ: విడపనకల్లు మండలంలోని ఉండబండలో వెలసిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో లోక కల్యాణార్థం విశేష పూజలు, హోమాలు సోమవారం ప్రారంభమయ్యాయి. గ్రామానికి చెందిన పాటిల్ కుటుంబ సభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో స్వామి మూలవిరాట్‌కు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పవిత్ర గంగాజలాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామికి అభిషేకించారు. అనంతరం స్వామికి మహా రుద్రాభిషేకం, మంగళహారతి ఇచ్చారు. ఈనెల 28న మహాగణపతి, నవగ్రహ, మహా రుద్రహోమం , 29న పూర్ణాహుతి కార్యక్రమంతో పూజలు ముగుస్తాయి.

భోగేశ్వరస్వామికి అభిషేకాలు



వజ్రకరూరులో భోగేశ్వర స్వామిని అలంకరించిన దృశ్యం

వజ్రకరూరు: స్థానిక భోగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు, రుద్రాభిషేకం, అర్చనలు, మహామంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకొని స్వామిని దర్శించుకున్నారు. నగరేశ్వరస్వామి,రామేశ్వరస్వామి ఆలయాల్లోనూ, జరుట్లరాంపురంలోని జరుట్లరామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొనకొండ్లలో ఛాయా మల్లేశ్వ రస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు.

కార్యకర్తకు పరామర్శ



ప్రేమ్ సాయిని పరామర్శిస్తున్న తలారి రంగయ్య

కళ్యాణదుర్గం రూరల్: పట్టనానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ప్రేమ్ సాయి మూడు క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య సోమవారం ప్రేమ్‌సాయి ఇంటికి వెళ్లి పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నేతలు బోయతిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

28 మంది పిల్లల గుర్తింపు

కంబదూరు: మండల వ్యాప్తంగా ఈనెల 3 నుంచి నిర్వహించిన ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల గుర్తింపు సర్వేలో 28 మంది చిన్నారులను గుర్తించినట్లు ఐఈఆర్టీ దేవీవిజయకృప సోమవారం తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే చేసినట్లు ఆమె తెలిపారు.

బీటీపీకి చేరుతున్న వరదనీరు

గుమ్మఘట్ట: బైరవానితిప్ప ప్రాజెక్టుకు వరదనీరు పోటెత్తుతోంది. ఎగువన ఉన్న కర్ణాటక ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో వేదావతి హగరి ద్వారా బీటీపీ రిజర్వాయర్‌కు సోమవారం సాయంత్రానికి 1,643 అడుగులకు నీరు చేరింది. రోజుకు అడుగు చొప్పున వరద నీరు వచ్చి చేరడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రిజర్వాయర్ గట్టుపై జలవనరుల శాఖ అధికారులు నిరంతరం నిఘా ఉంచాలని రైతులు కోరుతున్నారు.

విజయం ఎవరిని వరించేనో..!

- కళ్యాణదుర్గంలో అందరిలోనూ ఉత్కంఠ
- కౌంటింగ్ సమయం దగ్గరపడేకొద్దీ ఒకటే ఆసక్తి
- కీలకం కానున్న మహిళలు, క్రాస్ ఓటింగ్



కళ్యాణదుర్గంలో ఈనెల 13న ఓటు వేసేందుకు క్యూ కట్టిన మహిళలు

కళ్యాణదుర్గం: సార్వత్రిక సమరంలో నామినేషన్ ప్రక్రియ, ప్రచార, పోలింగ్ ప్రక్రియలు ముగిశాయి.. ఇక మిగిలింది కౌంటింగ్ ప్రక్రియ. కౌంటింగ్‌లో ఏపార్టీ అభ్యర్థి గెలుస్తారో తేలుతుంది. కళ్యాణదుర్గంలో జెండా ఎగురవేసేది ఏపార్టీనో అని ప్రతి ఒక్కరిలో ఉత్కంఠ నెలకొంది. కౌంటింగ్ సమయం దగ్గరపడుతున్న కొద్దీ అందరిలోనూ అదే ఆసక్తి. అయితే ఈ సారి మహిళల ఓట్లు, క్రాస్ ఓటింగ్ కీలకం కానుంది. గత ఎన్నికల కంటే ఈ సారి పోలింగ్‌శాతం కూడా పెరగడంతో ప్రతి ఒక్కరిలో గెలిచేదెవరన్నదానిపైనే చర్చ సాగుతోంది. ఈనెల 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరిగింది. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 2,30,785 మంది ఓటర్లు ఉండగా, 261 పోలింగ్ కేంద్రాల్లో 2,05,143 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతపురం జిల్లాలో ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 88.89 శాతం పోలింగ్ జరిగింది. గత 2019 ఎన్నికల్లో 86.8 శాతం పోలింగ్ జరిగింది.గతంలో కంటే భిన్నంగా ఈ ఎన్నికలు జరిగాయి. గతంలోనూ ఓటింగ్ శాతమే అభ్యర్థుల గెలుపును నిర్ణయించిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. నియోజకవర్గంలో కుందుర్పి, కంబదూరు మండలంలో సుమారు 40 వేలకు పైగా అత్యధికంగా ఓటర్లు ఉన్నారు. ఈ రెండు మండలాలు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నాయనే భావన అందరిలో ఉంది. గతంలో టీడీపీకి కంచుకోటగా ఉన్న బ్రహ్మసముద్రం మండలం, కళ్యాణదుర్గం రూరల్ మండలం, కళ్యాణదుర్గం మున్సిపాలిటీ ప్రాంతాల్లో ఓటింగ్ సరళి గతం కంటే భిన్నంగా ఉంది. 2019 ఎన్నికల ముందు టీడీపీకి ఏకపక్షంగా నిలిచిన ఈ ప్రాంతాల ఓటర్లు..ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా నిలిచినట్లు తెలుస్తోంది.

అభ్యర్థి గెలుపులో మహిళల పాత్ర కీలకం ..

ఈనెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌తోపాటు, మహిళలు ఎటు వైపు మొగ్గు చూపింటే ఆ పార్టీ అభ్యర్థికే విజయావకాశాలు ఉన్నాయని మేధావులు, రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఎన్నికల్లో 1,02,235 మంది మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాత్రి 11 గంటల వరకు పలు పోలింగ్ కేంద్రాల్లో నిరీక్షించి, మరీ మహిళా ఓటర్లు ఓట్లు వేశారు. దీంతో ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపులో మహిళల పాత్ర కీలకమని స్పష్టమవుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి తటస్తులు ఓటింగ్‌కు ప్రాధాన్యత ఇచ్చారు.

వైఎస్సార్‌సీపీ వైపే ప్రజల మొగ్గు..

ఈ ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన వారు వైఎస్సార్‌సీపీ వైపే మొగ్గ చూపినట్లు తెలుస్తోంది. దీనికి తోడు ఎన్నికలకు ముందు కళ్యాణదుర్గంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్ర నిర్వహించడంతో పార్టీ ప్రజలు, పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపింది. ఎన్నికల ప్రచార సమయంలో వైఎస్సార్‌సీపీకి చెడ్డపేరు తీసుకురావాలన్న ఉద్దేశంతో టీడీపీ వలంటీర్లపైనా కేసులు వేయడం, పింఛన్ పంపిణీ సమయంలో పింఛన్‌దారులను ఇబ్బందులకు గురి చేయడం చేసింది. అయినా ప్రజలు చంద్రబాబును, ఆపార్టీ అభ్యర్థిని ప్రజలు విశ్వసించలేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీనికితోడు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వివాద రహితుడు కావడం, ఉన్నత విద్యావంతుడు కావడం కలిసి వచ్చిన అంశం.